
ప్రజాశక్తి
ఆదివారం 1 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



5న జాబ్ మేళా

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న పిఎంఆర్‌సిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ వివి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అమెజాన్ కంపెనీ పాల్గొంటుందన్నారు. 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి పాసై, 18 నుండి 30 ఏళ్ల వయస్సు గల పురుషులు, స్త్రీలు అర్హులని తెలిపారు. అభ్యర్థులకు ఇంగ్లీష్ చదవడం వచ్చియుండాలన్నారు. ఈ జాబ్ మేళాకు అన్ని కులాల వారు అర్హులే అని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.15,800 జీతం పాటు అదనంగా ఇన్సెంటివ్ కూడా ఇవ్వబడునన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు నెల్లూరు సమీపంలో తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9885108092 నంబరుకు సంప్రదించాలని తెలిపారు

పత్రికల్లో ప్రజాశక్తిది ప్రత్యేకస్థానం

నిజాలను నిర్భయంగా రాస్తున్న ఏకైక పత్రిక
44వ వార్షికోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

నేటి సమాజంలో ఉన్న పత్రికల్లో ప్రజాశక్తిది ప్రత్యేక స్థానమని, నిజాలను నిర్భయంగా రాస్తున్న ఏకైక పత్రిక అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రజాశక్తి 44 వార్షికోత్సవ సభ శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్రజాశక్తి సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.పోలినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తోందని అన్నారు. ప్రజలు బాగు పడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. వారిని చైతన్యవంతం చేస్తూ ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ44 ఏళ్ల పాటు నిరంతరాయంగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ప్రజలు, ప్రభుత్వాల మధ్య సంబంధాలను మెరుగు పరచడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఒక పత్రిక ఉన్న నేటి రోజుల్లో ప్రజాశక్తికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో కూడా పత్రికలు కీలక పాత్ర పోషించాయి అని అన్నారు. పత్రికలు ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ పెట్టుబడిదారులు నిర్వహిస్తున్న దినపత్రికల మాదిరిగా ఆకర్షణీయంగా పేజీలు లేకపోయినా ప్రజాశక్తి దినపత్రికలో బడుగు, బలహీన వర్గాలు గిరిజనులు, అణగారిన వర్గాలు కార్మికులు, శ్రామికులు, కర్షకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్లుగా తమ కథనాల ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి, పాఠకులను ఆలోచింపచేసే వార్తలు రాసే పత్రిక అని కొనియాడారు. ఇలాంటి పత్రికలకు ప్రజలే చేదోడు వాదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. డిపిఆర్ఒ ఎల్.రమేష్ మాట్లాడుతూ వృత్తి పట్ల అంకితభావం, క్రమశిక్షణ, ఉదాత్తమైన ఆలోచనలు కలిగిన పాత్రికేయ సిబ్బందితో నేటికీ 44 ఏళ్ల పాటు పత్రిక మనగలడం ఈరోజుల్లో సాధ్యం కాని విషయమని, ఘనత ప్రజాశక్తికే చెల్లిందని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా దినపత్రికల్లో మార్పు వచ్చినప్పటికీ నీతి నిజాయితీతో పాటుగా పాత్రికేయ విలువలు పాటించడంలో ఎలాంటి మార్పు చెందకుండా ప్రజల పక్షాన నిలిచే పత్రికల్లో ఈ పత్రిక ముందు వరుసలో ఉంటుందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ వాస్తవాలను ప్రతిబింబిస్తూ, ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న ప్రజా సంఘాలకు గొంతుకై నిలిచి తమ కథనాలతో వాస్తవాలను ప్రచురిస్తూ అధికారులతో పాటు ప్రజలను ఆలోచింప చేయడంలో ప్రథమ స్థానం ప్రజాశక్తి దేనిని అన్నారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు మాట్లాడుతూ కాలానుగుణ మార్పులతో 1981 నుండి ప్రజాశక్తి దినపత్రికగా సేవలు అందిస్తున్నప్పటికీ, వాస్తవానికి 1942 నుండి వామపక్ష భావాలతో పత్రికను వివిధ రూపాల్లో నడిపిస్తూ ప్రజా సమస్యలను వార్తల రూపంలో ప్రతిబింబించడం 84 ఏళ్ల క్రితమే బాధ్యతగా చేపట్టిందన్నారు. ప్రజాశక్తి మేనేజర్ సిహెచ్ రాము మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా ప్రజాశక్తి సిబ్బంది కలెక్టర్, ఎమ్మెల్యేలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పడాల రాజశేఖర్‌తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు సాహితీ అభిమానులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డిపిఆర్ఒ డి.రమేష్, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి కృష్ణాజీ, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు తదితరులు



మోటూరుకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రజాశక్తి జిల్లా కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని అగ్రహారం వీధిలో ప్రజాశక్తి కార్యాలయాన్ని శనివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, జి.వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి రాజశేఖర్, ప్రజాశక్తి సిజిఎం అచ్యుతరావు, మేనేజర్ సిహెచ్ రాము, పలు మండలాలకు చెందిన విలేకరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గౌరినాయుడు

తుపాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం

సోమవారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

తుఫాను పట్ల జిల్లా యంత్రాంగంగాన్ని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ – 08963 293046 ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒ కార్యాలయాలతో పాటూ అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రదేశాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు మేరకు వచ్చే ఐదు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన అన్నారు. గాలులు కూడా కనీసం 50 కిలో మీటర్ల వేగంతో వీస్తాయని చెప్పారు. వేగం ఇంకా పెరగవచ్చని ఆయన చెప్పారు.

సోమవారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు పనిచేస్తాయని చెప్పారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ డివిజనల్ అధికారులు కె హేమలత, వి వి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి కె రాబర్ట్ పాల్, జలవనరుల శాఖ అధికారులు ఆర్ అప్పల నాయుడు, జగదీష్, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ అధికారి శ్రీనుబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి తిరుపతయ్య, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎం జేమ్స్ , సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు : ఎస్‌పి

రాబోతున్న తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశించారు. తుఫాను కారణంగా రాబోవు నాలుగైదు రోజులు తుఫాను ప్రభావం ఉంటుందని సైక్లోన్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ, రాష్ట్ర ముఖ్యమంత్రి టెలి కాన్ఫరెన్స్‌లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అధికార యంత్రాంగం ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. చెరువులు, కాలువలు, నదులు, కొండ దిగువ కాలువలు దగ్గర వాటర్ ఫ్లో ఎక్కువగా ఉన్నప్పుడు అక్కడ ప్రజలను దాటనీయకుండా తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

బదిలీ యత్నాల్లో మున్సిపల్ అధికారులు

అర్హత లేని వారు కూడా పైరవీలు
గాడితప్పిన పురపాలన
కొండెక్కిన సాధారణ సమావేశం

ప్రజాశక్తి – సాలూరు

మున్సిపాలిటీలో విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించింది. ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన ఉద్యోగులు, అధికారులు బదిలీలకు అర్హులని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మున్సిపాలిటీలో ఐదేళ్ల పాటు పని చేసిన ఉద్యోగులు బదిలీలకు అర్హులే. కానీ ఐదేళ్లు పూర్తి కాని ఉద్యోగులు కూడా బదిలీపై వెళ్లిపోయేందుకు ముమ్మరంగా పైరవీలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చుకొనో, రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొనో ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని భావిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మున్సిపాలిటీలో పరిపాలన పూర్తిగా గాడితప్పడమే. వైసిపికి చెందిన పాలకవర్గ సభ్యుల మధ్య గ్రూపు రాజకీయాలు పురపాలనపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఒక గ్రూపు ఔనంటే మరో గ్రూపు కౌన్సిలర్లు కాదనే పరిస్థితి నెలకొంది. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో మున్సిపాలిటీలో పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. మున్సిపల్ అధికారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకవర్గ సభ్యుల మధ్య గ్రూపు రాజకీయాల వల్ల మున్సిపల్ అధికారులు లక్ష్యంగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. మరో ఏడాదిన్నర ఇదే పాలకవర్గం కొనసాగే అవకాశం ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ పని చేయలేమని కొంతమంది అధికారులు బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన కమిషనర్ ప్రసన్న వాణి బదిలీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అదే విధంగా అన్ని విభాగాల కు చెందిన అధికారులు కూడా బదిలీకి ఐదేళ్లు పూర్తి కాకపోయినా తెరవెనుక పైరవీలు సాగిస్తున్నారు. ఈనెలాఖరులోగా బదిలీలు పూర్తి చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. బదిలీల ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో ప్రభుత్వం సెప్టెంబర్ 15వరకు పొడిగించింది.

పట్టణ సమస్యలు గాలికి, సాధారణ సమావేశం హుళక్కి

మున్సిపల్ అధికారుల బదిలీ యత్నాల్లో బిజీగా వుండడంతో ఈ నెల సాధారణ సమావేశం నిర్వహించే నాధుడు కరువయ్యారు. ఉన్న అధికారులతోనైనా సమావేశం నిర్వహించడానికి చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ప్రయత్నం చేయలేదు. గత సాధారణ సమావేశంలో షాపు నెంబర్ 20 అద్దె గోల్ మాల్ వ్యవహారంపై పాలకవర్గ సభ్యుల మధ్య రచ్చయింది. ఈ నెల సమావేశంలోనూ అదే అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న పాలకులు అధికారులు బదిలీ యత్నాల్లో వున్నారని సాకు చూపి సాధారణ సమావేశాన్ని అటకెక్కించారు. దీంతో పట్టణంలోని ప్రజాసమస్యలు గాలికొదిలేసారనే వాదనలు వినిపిస్తున్నాయి.



ప్రజా ప్రయోజన పనులు గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు గుర్తించాలని, గిరిశిఖర, మారుమూల గ్రామాలకు రోడ్డు అనుసంధానం కలిగేలా పనులు చేపట్టాలని కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఉపాధిహామీ చట్టం ద్వారా చేపట్టిన పనులపై పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరా, ఐటిడిఎ ఇంజనీరింగు అధికారులతో ఇంజనీరింగు పనుల ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. ఈ సమీక్షలో అంసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, పనులు వారీగా పురోగతిని సమీక్షించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ పెండింగు పనులను పూర్తిచేసేందుకు రానున్న 15 రోజులకు సంబంధించి ప్రణాళిక అందజేయాలని తెలిపారు. ఇంజనీరింగు పనులకు సంబంధించి ప్రజాప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిశిఖర, మారుమూల ప్రాంతాలకు రోడ్డు సదుపాయాలు కల్పిస్తూ పనులు ఆమోదించాలని, 80శాతానికి పైగా పూర్తయిన పనులను మొదటగా పూర్తి చేయాలని తెలిపారు. గిరిజన గ్రామాల్లో అంతర్గత రోడ్లు, కాలువలు, రక్షిత గోడల నిర్మాణ పనులను గుర్తించాలని తెలిపారు. మంజూరైన పనులకు సంబం ధించి పనులు చేపట్టని కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారిచే పనులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆమోదించిన 10 కిలోమీటర్ల సిసి రోడ్లు, 10 కిలోమీటర్ల సిసి కాలువల నిర్మాణ పనులు పూర్తిచేయాల ని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి బోర్ల సమస్త సమాచారం క్రోడీకరించుకోవాలని తెలిపారు. మంచినీటి సరఫరా పనులే కాకుండా బోర్లలో నీరు తగ్గిపోకుండా నీటి మట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన వివరాలు డ్వామా పీడీ కె.రామచంద్ర రావు తెలియ జేస్తూ ఈ ఏడాది కోటి 40లక్షల పని దినాలు, రూ.241కోట్లు పనులు కేటాయించినట్లు తెలిపారు. రూ.142 కోట్లు విలువ చేసే 462 పనులు ఆమెదం పొందియున్నాయని, రూ.70 కోట్లు పనులు పస్తుతం జరుగుతున్నాయని వివరించారు. రూ.6.90కోట్లు బిల్లులు చెల్లించామని తెలిపారు. సమీక్షా సమావేశంలో జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్‌కష్ణాజీ, పంచాయతీ రాజ్, గ్రామీణనీటిసరఫరా, ఐటిడిఎ ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.




ఇంజినీరింగ్ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ
గిరిజన వర్సిటీపై ఏదీ?

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

కార్పొరేట్ సంస్థలకు, ధనవంతులకు ఉపయోగపడే భోగాపురం ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ... పేద, ధనిక అనే తేడా లేకుండా విజ్ఞాన్ని అందించే కేంద్రీయ గిరిజన వర్సిటీపై పాలకులు, ముఖ్యంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా మంత్రులు చూపడం లేదని జనం చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లాకు చెందిన చిన్న తరహా పరిశ్రమల మంత్రి సహా ఎమ్మెల్యేలు, ఎమ్‌పి కూడా ఎయిర్‌పోర్టు పనుల పరిశీలనకు పలు సందర్భాల్లో వెళ్లారు. అంతకు ముందే చేపట్టిన గిరిజన వర్సిటీ పనులను మాత్రం మచ్చుకు కూడా పరిశీలించలేదని జనం వాదన. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 2014లో జిల్లాకు మంజూరు చేసిన ఈ వర్సిటీని రకరకాల కుంటిసాకులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెట్టుకొచ్చింది. 2019 ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ శాశ్వత భవనం గానీ, వర్సిటీ స్థాయికి తగ్గట్టు కోర్సులుగానీ, ఉన్న కోర్సులకు తగినంత అధ్యాపకులను గానీ నియమించలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఎయుకి చెందిన భవనంలో 120 అడ్మిషన్లతో నాడు ప్రారంభమైంది. ప్రస్తుతం 434 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. తగినంతగా తరగతి గదులు లేవు. దీంతో, వరండాలను సైతం తరగతి గదులుగా మార్చారు. కంటైనర్లలో లేబోరేటరీలు ఏర్పాటుచేశారు. అధునాతన పరికరాలు ఉన్నా వాటిని వినియోగంలోకి తేలేని పరిస్థితి దాపురిస్తోందని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విలువైన పుస్తకాలు ఉన్నా ప్రత్యేకించి లైబ్రరీ లేదు. విద్యార్థుల ఆటపాటలకు స్థలం, వ్యాయామశాల కరువవడంతో అంతా కలిసిమెలిసి ఉండడం, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం వంటివి మచ్చుకు కూడా కనిపించని దుస్థితి వర్సిటీలో నెలకొంది. అధ్యాపకులు కూడా తగినంత మంది లేరు. ఇటువంటి పరిస్థితుల్లో మెంటాడ – దత్తిరాజేరు మండలాల సరిహద్దు గ్రామాల్లో తలపెట్టిన యూనివర్సిటీ నిర్మాణ పనులు వేగవంతానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గిరిజన వర్సిటీ నిర్మాణానికి రూ.834కోట్లు కేటాయించారు. 2027నాటికి ఈ పనులు పూర్తిచేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండర్‌లోని మెకాన్ ఇండియా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టింది. రూ.305 కోట్ల వ్యయంతో ఫేజ్ -1 పనులు చేపట్టారు. ప్రస్తుతం చాలా వరకు ల్యాండ్ లెవిలింగ్ పూర్తయింది. నీటి, మట్టి పరీక్షలు పూర్తిచేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన సమావేశంలో కలెక్టర్ చొరవ చూపారనడంలో సందేహం లేదు. నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరించారు. పనులు సకాలంలో పూర్తికావాలంటే ప్రభుత్వం, ముఖ్యంగా అమాత్యులు ఎంతో చొరవ, నిరంతర పర్యవేక్షణ అవసరం. అధికారులు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదన్నది పబ్లిక్ టాక్.

జిల్లాలో 94.49 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

జిల్లాలో శనివారం ఒకేరోజులో 94.49శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మొత్తం 1, 42, 866 సామాజిక పింఛన్ల గాను 1,35,141 పింఛన్ల పంపిణీ చేయగా, రూ. 56,09,70,500 నగదును పింఛనుదారులకు అందజేసినట్టు తెలిపారు. శనివారం పింఛన్ అందుకొని వారికి సోమవారం అందజేస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

బాలగొడబలో

: మండలంలోని బాలగోడబలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గురజాన చంద్రమౌళి బోను చంద్రమౌళి మువ్వల పాదాల నాయుడు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మున్సపల్ పరిధిలో గల 13వ వార్డులోని ఇందిరా కాలనీలో ఎన్ టి ఆర్ భరోసా సామాజిక పింఛన్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పంపిణీ చేశారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది, ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా సంబంధిత అధికారులు సిబ్బందిచే పనులు చేయించాలని సూచించారు.



పార్వతీపురం పట్టణంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

కొత్తవలసలో...

పట్టణంలోని కొత్తవలసలో పలు వార్డుల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ జరిగేదని, కానీ ఈసారి ఒకరోజు ముందుగానే వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు పండగ వచ్చిందని అన్నారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతుందని, రైతు సంక్షేమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ బార్నాల సీతారాం, టిడిపి పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, నాయకులు పత్తిగుల్ల సత్యనారాయణ, భూరి కష్ణారావు, గౌరీ శంకర్, సుంకర ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని 9187మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ తెలిపారు. మండలంలో 9843 మంది పింఛనుదారులకు గానూ 91 87 మందికి పంపిణీ చేసి 93.34 శాతం పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

కురుపాం : మండలంలోని ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశామని, ఒకటో తారీఖు సెలవు దినం కావడంతో అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా సిఎం ఆదేశాలతో ఒక రోజు ముందే పెన్షన్లు అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్. అప్పారావు, ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితోపాటు టిడిపి, జనసేన నాయకులు కొండయ్య, సురేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలో పింఛన్ల పంపిణీని అధికారులు చురుగ్గా చేపట్టారు. విక్రాంపురంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు అన్నారు. కార్యక్రమంలో టిడిపి బూత్ కన్వీనర్లు దేవకోటి ఉదయ్ కుమార్, పల్లె శంకర్రావు, మధు రఘు, దేవకోటి అజయ్ కుమార్, విఆర్ఒ సుజాత, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో సీతంపేట ఫస్ట్

ప్రజాశక్తి – సీతంపేట

మండలంలో 53 పంచాయతీలు 31 గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న 8044 పెన్షన్లకు ఆదివారం ఒకటో తేదీ సెలవు దినం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.మానస ఆధ్వర్యంలో 7815మంది పెన్షన్లు పంపిణీ చేశారు. 97.59శాతం పింఛన్లు పంపిణీ చేయడంతో సీతంపేట మండలానికి పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం దక్కించుకుంది



చేతులెత్తి చైర్మన్‌ను ఎన్నుకుంటున్న సభ్యులు

ఎస్ఎంసి ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా చైర్పర్సన్ కర్రి రామకృష్ణ, వైస్ చైర్మన్ రేవతితో పాటు 22 మందిని సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు బి.మనోజ్ కుమార్ తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ స్కూల్ రెండుసార్లు వాయిదా పడడంతో మూడోసారి ఎటువంటి గొడవలు జరగకుండా ఎన్నిక పూర్తయింది.

జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడిలో మండల ప్రాథమిక పాఠశాల (ఆర్) మేనేజ్మెంట్ కమిటీ ఎన్నిక శనివారం ఎంఇఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరిగింది. ఈ పాఠశాలలో 22 మంది విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని స్కూల్ చైర్మన్ గా రేవళ్ళ సాయిరాం, వైస్ చైర్మన్ మజ్జి కరుణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జిఎం వలస పోలీస్ సిబ్బంది సమక్షంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు సిఆర్పి పోలినాయుడు పాల్గొన్నారు

పవన్ పుట్టిన రోజుకు ఘనంగా ఏర్పాట్లు


ప్రజాశక్తి - పాచిపెంట

సెప్టెంబర్ 2న ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు శివాలయంలో ప్రత్యేక పూజలు, 8 గంటల నుంచి స్థానిక కమ్యూనిటీ భవనం దగ్గర రక్తదాన శిబిరం, 10గంటలకు పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. 12 గంటలకు అన్నదానం, కేక్ కటింగ్ , 3 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం, సాయంత్రం గొట్ట గ్రామంలో కేక్ కటింగ్, రాత్రి 7గంటలకు ఎగువ వీధిలో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని చెప్పారు. వాటిని వినియోగించినా, అక్రమ రవాణాకు సహకరించినా కఠినమైన శిక్షలు గురవుతారని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా అమలుకు యువకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని డబ్బివీధిలో చిరంజీవి పవన్ కళ్యాణ్ అభిమానసంఘం ఆధ్వర్యాన వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సెప్టెంబరు 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు.

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గోయిది, మండ, నాయుడుగూడ, సిలగం పంచాయతీల్లో పిఎం జన్‌మాన్ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం మాట్లాడుతూ గ్రామాల్లో కనీస అవసరాలు ప్రతి కుటుంబానికి తీర్చడమే పిఎం జన్‌మాన్ గ్రామ సభ ముఖ్యో ఉద్దేశమన్నారు. ఎవరెవరికి ఏఏ అవసరాలు ఉన్నాయని తెలపాలని చెప్పారు. ప్రతి గ్రామానికి తాగునీరు, ఇళ్లు, రహదారులు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మామిడిపల్లి పిఎసిఎస్ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సాలూరూరల్

మండలంలోని మామిడిపల్లి పిఎసిఎస్ కార్యదర్శి హరి నాగరాజు (60) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయన మామిడిపల్లిలో కార్యదర్శిగా 15 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గత కొంత కాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ శనివారంఉదయం మరణించారు. ఆయన భౌతికకాయానికి మండలంలోని అన్ని పంచాయతీల ప్రజలు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు జరాజాపు సూరిబాబు, దండి శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణ, బూస తవుడు, సువ్వాడ రామకృష్ణ నివాళులు అర్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గం

ప్రజాశక్తి - కురుపాం

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంపకమే మార్గమని స్థానిక తహశీల్దార్ ఎం.రవణమ్మ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జనసేన నాయకులు ఎన్.వంశీ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు శ్రీరామ్, మురళి, రవి, ప్రసాద్, రాధాకష్ణ, సాయి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

తన తల్లి తండ్రులు కీర్తిశేషులు ఎం.ఎస్ నాయుడు, కౌశల్యమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కుమార్తెలు మంతిని వాసుదేవరావు నాయుడు, సుశీల, నాగరత్నం పేదవృద్ధులకు కురుపాంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేసి, భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా పేదలకు దుప్పట్లు పంచుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బలగ రామకృష్ణ పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాసుదేవరావునాయుడు

చైర్‌పర్సన్ తీరును నిరసిస్తూ

సమావేశం నుండి స్వపక్ష సభ్యులే వాకౌట్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి తీరుని నిరసిస్తూ వైసిపి అధికార పార్టీ కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సాధారణ సమావేశాన్ని వాకౌట్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. వైసిపి పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్‌తో పాటు పలువురు అధికార వైసిపి కౌన్సిల్ సభ్యులు చైర్‌పర్సన్ తమ ఆమోదాలను, అభిప్రాయాలను, సూచనలను, సలహాలను తీసుకోవడం లేదని, గత సాధారణ సమావేశంలో ఈ విషయంపై అజెండాను ఆమోదించకుండా, తాము నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోతే అజెండాను ఆమోదించడమేమిటిని ఆగ్రహం వ్యక్తం చూస్తూ కౌన్సిల్ సమావేశం నుండి బయటికి వెళ్లిపోయారు. వైసీపీ అధికార కౌన్సిల్ సభ్యులు గత రెండు నెలలుగా సమావేశాల్లో పట్టణ సమస్యలు ప్రస్తావించకుండా వెళ్లిపోవడంతో మున్సిపల్ అధికారులకు ప్రశ్నార్థకంగా మారింది. కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర స్పందిస్తూ కూటమి ప్రభుత్వం హయాంలో పార్టీలకు అతీతంగా పాలన సాగుతుందని అన్నారు. తాగునీరు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తీరుపై 8, 21వ వార్డు కౌన్సిల్ సభ్యులు కోరాడ నారాయణరావు, బడే గౌరీ నాయుడులు స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ అనధికార భవన నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పట్టించుకోవడంలేదని, దీంతో అక్రమ నిర్మాణదారులు, మరి బరితెగించి నిర్మాణాలు చేపడుతూ, మున్సిపల్ ఆదానికి గండి కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని సూచించారు.

పట్టణ ప్రజలకు ఐదు రోజులకు, ఆరు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా ఇవ్వడంతో వార్డుల్లోకి వెళ్లలేకపోతున్నామని ఒకటో వార్డ్ కౌన్సిలర్ రణభేరి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందిస్తూ ఐదు రోజుల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేయడం జరుగుతుంది హామీ ఇచ్చారు. తమ వార్డులో మూడు నెలలుగా ఎలాంటి అభివద్ధి పనులు జరగలేదని, పారిశుధ్య నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉందని 14వ వార్డు టిడిపి కౌన్సిలర్ డి.శ్రీదేవి ఆవేద వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి పార్టీలకతీతంగా పాలకవర్గ కౌన్సిల్ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలని మున్సిపాలిటీకి ఎక్కువ నిధులు అందజేయాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు అడిగినట్టు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్, కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

డిడి కార్యాలయాన్ని తరలిస్తే పోరాటం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సీతంపేట ఐటిడిఎకు చెందిన ట్రైబల్ వెల్ఫేర్ డిడి కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలిస్తే పోరాటం చేస్తామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు, గౌరవాధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిడి కార్యాలయం సీతంపేటలో ఉండడం వల్ల ఐటిడిఎకు చెందిన 20 మండలాలకు అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే పిఒ కూడా సీతంపేటలోనే ఉంటున్నారని, కావున ఎనొ డిడి సమన్వయం సులువు అవుతుందని, దీనివల్ల గిరిజనులు సమస్యలు తక్షణ పరిష్కారానికి దోహదపడుతుందని అన్నారు. అలాగే ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు సమస్యలు పరిష్కారానికి కూడా సులువుగా ఉంటుందన్నారు. కావున డిడి కార్యాలయాన్ని సీతంపేటలోనే ఉంచాలని, , లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రకటనలో తెలిపారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

కొమరాడ :మండల కేంద్రమైన కొమరాడ సచివాలయానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 20 లోపు రెగ్యులర్ కార్యదర్శిని నియమించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సచివాలయానికి 18 నెలలుగా ఇన్‌ఛార్జి సెక్రటరీ ఉండడం వల్ల సకాలంలో సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారానికి రెండు, మూడు రోజులుసచివాలయానికి రావడంతో గ్రామంలో పారిశుధ్యం పనులు, మంచినీటి సప్లై సక్రమంగా లేక అనేక ఇబ్బందులకు ప్రజలు గురయ్యే పరిస్థితి ఉందని అన్నారు.



కృష్ణాజీ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, జెసి

అధికారులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉద్యోగ విరమణ చేసిన జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణను జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన వీడ్కోలు సభలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన అధికారులను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా అభివృద్ధికి పనిచేయాలని సూచించారు. ఈ ఇద్దరు అధికారులు జిల్లా ఆవిర్భావం నుండి వారి శాఖల ద్వారా ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ సేవలందేలా కృషిచేశారని కొనియాడారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేయుటకు పంచాయతీరాజ్ శాఖ కృషిచేయగా, ప్రజా సంక్షేమానికి పారిశుధ్యం నిర్వహణలో పంచాయతీ అధికారులు నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. వారి పనితీరును, క్రమశిక్షణను అలవర్చుకొని తర్వాత అధికారులు పనిచేయాలని, వారిని మార్గదర్శకులుగా స్ఫూర్తిని పొందాలని సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కష్ణాజి మాట్లాడుతూ ఉద్యోగబాధ్యతల్లో భాగంగా జిల్లాలోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మాణాలు చేపట్టి, గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఉద్యోగ బాధ్యతలలో భాగంగా సహాయ సహకారాలు అందించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డిపిఒ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ జీవితం ఎంతో సంతప్తిని ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో జెసి ఎస్ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఆర్‌డిఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, డిపిఆర్ఒ ఎల్. రమేష్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబరపడుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి ఏ స్థాయిలో నిర్మాణాలు చేపట్టారన్నది పరిశీలిస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ ఎఇ వి.దిలీప్ కుమార్ తెలిపారు. మండలంలోని కంబరలో శనివారం ఎన్టీఆర్ గృహాలు పరిశీలించడంతో లబ్ధిదారులు సంబరపడుతున్నారు. గత ఐదేళ్లలో ఎటువంటి బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యామని, తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ మొదటికొచ్చిన డంపింగ్‌యార్డు సమస్య

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీని కొద్ది రోజులుగా పట్టి పీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్య నేటికీ పరిష్కరం కాలేదు. సింగన్నవలస పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వస్థలాన్ని డంపింగ్‌యార్డుకు ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ చొరవతో రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందుకు అందరూ అంగీకరించారు. అయితే శనివారం ఉదయం నగర పంచాయతీ చెత్త ట్రాక్టర్లను అక్కడున్నవారు అడ్డుకున్నారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. 2013లో నగర పంచాయతీగా మారినా ఇంత వరకు శాశ్వత డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయలేదు. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలించలేదు. దీంతో సేకరించిన చెత్తను నగర పంచాయతీ సమీపంలో వేశారు. ఇటీవల పట్టణ వాసులు ఆందోళనకు దిగారు. దీంతో అట్టలి వద్ద మూడు ఎకరాల స్థలాలను గుర్తిస్తే దాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో బెజ్జి దగ్గర స్థలాలను గుర్తిస్తే అక్కడ కూడా వ్యతిరేకించారు.

స్పందించిన పాలకవర్గం, అధికారులు

తాజాగా సింగన్నవలస పంచాయతీ దగ్గర డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలాలపై వివాదం రావడంతో శనివారం అధికార యంత్రాంగంతో పాటు పాలకవర్గల సభ్యులు తహశీల్దార్ పి.బాలమురళీకష్ణ, కమిషనర్ సర్వేశ్వరరావు, సర్వేయరు వెంకటరమణ, కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కిల్లారి మోహనరావు, భాసూరు కాంతారావు, కడగల రమణ, కోడెం విజయకుమార్, పడాల రాంబాబు, తూముల లక్ష్మణ, కొంచాడ అరుణ్, పల్లా బాను, తదితరులు చర్చించారు. అనంతరం గుర్తించిన స్థలం దగ్గరకు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. దీనిపై సింగన్నవలస పంచాయతీ తీర్మానం తీసుకోవాలని తహశీల్దార్ సూచించారు. ఆ స్థలానికి హద్దులు గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నాం

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు తామంతా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని పట్టణ వైసిపి అధ్యక్షుడు, ఐదో వార్డు కౌన్సిలరు వెలమల మన్మథరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ గత మూడేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో కూడా డంపింగ్ యార్డుకు అనేక ప్రాంతాల్లో స్థలాలు గుర్తించామన్నారు. అక్కడ వివాదాలు తలెత్తతడంతో నిలిచిపోయాయన్నారు. పట్టణంలో తెలుకులవాని చెరువు వద్ద డంపింగ్ యార్డు ఉండగా అక్కడ తొలగించాలని టిడిపి నాయకులు అడ్డుకున్నారని, మళ్లీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవతో కలెక్టర్‌ను కలిసి బెజ్జి దగ్గరలో ఐదు ఎకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. అక్కడ కూడా టీడీపీ నాయకులు అడ్డుకున్నారుని చెప్పారు. ఓనికి వెళ్లే ప్రాంతంలో బత్తినివాని చెరువు దగ్గర చెత్తను వేయగా రైతులు వ్యతిరేకించారన్నారు. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రస్తుతం సింగన్నవలస పంచాయతీ దగ్గర డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడనికి కూడా తాము చిత్తశుద్ధితో ఉన్నామన్నారు.



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

ప్రజాశక్తి - కొమరాడ

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. కుమ్మరిగుంటను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గ్రామ పరిసరాలను పరిశీలించి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న ప్రదేశాలు ఏమైనా ఉన్నాయా, ఎటువంటి నివారణా చర్యలు చేపడుతున్నారని సిబ్బందిని ఆరా తీశారు. డ్రైడే కార్యక్రమాల్లో ప్రతి ఇంటి పరిసరాలను నిశితంగా గమనించి దోమల లార్వా గుర్తించాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి నమోదు చేసిన ప్రజల ఆరోగ్య సమస్యల వివరాలు, రక్త పరీక్షలు పరిశీలించారు. జ్వరాలు, రక్తహీనత ఉన్న వారిని నివారణయ్యే వరకు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అనంతరం గర్భిణుల గృహ సందర్శన చేసి ఎంసిపి కార్డులను తనిఖీ చేసి వారికి అందుతున్న వైద్య సేవలపై, అంగన్వాడీ సిబ్బంది అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎల్ పురం హెల్త్ వెల్నెస్ కేంద్రం పరిధిలో ఉండే గర్భిణుల్లో రక్త హీనతగా గుర్తించిన వారి జాబితా సిద్ధం చేయాలని, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి హిమోగ్లోబిన్ శాతం పురోగతి చెందేలా కార్యాచరణ చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్య సమస్యలను గుర్తించడంలో జాప్యం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎపిడిమిక్ సెల్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది వాణి, శారద, అప్పలనాయుడు, ఆశ కార్యకర్తల తదితరులు ఉన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని రూరల్ సిఐ ఎస్.గోవిందరావు అన్నారు. శనివారం ఎస్సై నీలకంఠం ఆధ్వర్యంలో స్థానిక కళాశాలలో మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారిస్తే భవిష్యత్తు మంచిగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న ప్రస్తుత పరిస్థితుల బట్టి యువత చెడు వ్యసనాలకు బానిసగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కావున చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి ఉత్తీర్ణతతో మార్కులు సాధించాలని సూచించారు. ముఖ్యంగా యువత మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి లోనుకాకుండా తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు ప్రస్తుతం ఉన్న దశ చాలా కీలకమని ఈ దశలో జాగ్రత్తలు పాటిస్తూ మంచి సత్రపవర్తన నేర్చుకుంటే వారి భవిష్యత్తు బంగారు బాటగా ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా చదువుకుంటూ తమ కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై. నాగేశ్వరరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నదీ తీరాల వద్ద అప్రమత్తం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని శివరాంపురం వద్ద వేగావతి నదిలోకి దిగొద్దని హెచ్చరిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. నది ప్రవాహాన్ని శనివారం తహశీల్దార్ ఎన్వి రమణ పరిశీలించారు. శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, నదీ ప్రవాహం ఉధృతమవున్నందున ప్రజలెవరూ కాజ్ వే మీదుగా వెళ్లొద్దని కోరారు. ఈ మేరకు వంతెన సమీపంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట హెచ్‌డిటి భానుప్రసాద్ వున్నారు.

వీరఘట్టం : బంగాళాఖాతంలో అల్పపీడన కారణంగా వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపిడిఒ వై.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ముఖ్యంగా నదీ పరిహక ప్రాంతాల్లో ప్రజలు నది వద్దకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

కొమరాడ :రానున్న రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.రమేష్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వం నుంచి హెచ్చరికలు వచ్చాయన్నారు. కావున మండలంలోని నాగావళి, జంఝావతి నదీపరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నాగావళి నదిపై పడవ ప్రయాణాలను నిలుపుదల చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఉప తహశీల్దార్ శివయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.

గులిరాగిలో సైకిల్ వీడర్ ఎంతో అవసరం

ప్రజాశక్తి - పాచిపెంట

వినూత్నమైన గాప్ చోడి పంట పొలంబడిలో భాగంగా ఆరో వారం రైతులకు గుళి పద్ధతిలో చోడి సాగు చేసే పద్ధతిపై శిక్షణను మండలంలోని పెదకన్నూరులో పొలంబడి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు నిర్వహించారు. పంటలను వరుసల్లో వేసుకుంటే తేలిక నేలల్లో సైకిల్ వీడర్‌తో కలుపు నివారణ సులువుగా చేసుకోవచ్చన్నారు. చోడి పంటను గులి పద్ధతిలో పండిస్తే ఎకరాకు 18 క్వింటాలకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇది రైతు క్షేత్రాల్లో నిరూపితమైందని తెలిపారు. ఈ పద్ధతిలో ముందుగా చోడి పంట నారును ఎత్తైన నారుమడిలో పెంచుకుని 15 రోజుల్లోపు అడుగున్నర దూరంలో ఒక్కొక్కటిగా మొనలను నాటుకొని మూడు, నాలుగు సార్లు పంట కాలంలో ఎకరానికి ఒక్కొక్క దఫా 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు సురేష్ కుమార్, విజయ్, రాజు రైతులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కొండను ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఆంధ్రా - ఒడిస్సా ఘాట్ రోడ్డు కంకణపల్లి జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి లారీ అదుపుతప్పి కొండను బలంగా ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ చెట్ల పాపారావు (58) మృతి చెందాడు. పోలీసుల అందించిన వివరాలు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన లారీ ఒడిస్సా నవరంగ్పూర్ నుంచి కాకినాడ దాణాలోడుతో వస్తున్న లారీ శుక్రవారం రాత్రి ఆంధ్ర ఒడిస్సా ఘాట్ రోడ్డు కంకణపల్లి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి కొండను బలంగా ఢీకొంది. దీంతో లారీ క్యాబిన్ పూర్తిగా నుజ్జు అవ్వడంతో డ్రైవర్ పాపారావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మతి చెందాడు. పాపారావు కుమారుడు విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సమర్పణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఇసుక పట్ట పంగిడి గ్రామస్తుడు.

సింగిల్ విండో విధానం ద్వారా

వినాయక చవితి నిర్వహణకు అనుమతులు

ప్రజాశక్తి - సీతానగరం

వినాయకచవితి ఉత్సవాలకు సంబంధించి అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు మంజూరు చేయనున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో వినాయక చవితి ఏర్పాట్లపై మాట్లాడారు. గణేష్ ఉత్సవ అనుమతి లింక్ http:// ganesh utsav.net%ను సంప్రదించడం, లేదా అనుమతుల కోసం 7995095800 సెల్ ఫోన్‌కు మిస్డ్ కాల్ చేయండని ఆయన తెలిపారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, మున్సిపల్, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ అధికారులతో కూడిన సింగల్ విండో వ్యవస్థను అమలు చేయడం ప్రారంభించడం జరిగిందన్నారు. వీరంతా స్పాట్ విజిట్, వెరిఫికేషన్ చేస్తున్న తర్వాత నిర్వాహకులకు క్యూఆర్ కోడ్ పంపించడం జరుగుతుందన్నారు. దీన్ని గణేష్ ఉత్సవాలు వద్ద అతికించాలన్నారు. పోలీస్ భద్రత చర్యలను ట్రాక్ చేయడంలో ఇది ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ సింగిల్ విండో సిస్టం ద్వారా నిమజ్జనం తేదీ, స్థలం, విగ్రహంఎత్తు, మరియు నిర్వాహకుడి వివరాలు అన్నీ కలిపి మొత్తం సమాచారం ఒకచోట నిక్షిప్తమై ఉంటుందన్నారు. వినాయక చవితి ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించే ప్రజలు, యువత పోలీసు వారు అందజేస్తున్న ఈగణేష్ ఉత్సవ అనుమతి లింకులను ఉపయోగించి తద్వారా సింగిల్ విండోస్ సిస్టంకు ఉపయోగించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక పోలీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

సాలూరు : పట్టణంలో రానున్న వినాయక చవితి సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని టౌన్ సిఐ బి.అప్పలనాయుడు చెప్పారు. సింగిల్ విండో విధానం ద్వారా నిర్దేశించిన వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతి పొందవచ్చునని చెప్పారు. సెల్‌ఫోన్ నుంచి కూడా అనుమతులు పొందవచ్చునని తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సిఐ అప్పలనాయుడు కోరారు.

పార్వతీపురం రూరల్ : వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు ఆన్లైన్లో పోలీసు వారి అనుమతి తప్పకుండా పొందాలని, రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండలంలోని పెదబొండపల్లి గ్రామస్తులకు వినాయక చవితి మండపాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్లో ఉన్న యాప్‌ల్లో అనుమతికి దరఖాస్తు చేసుకోవాలని, దానిలో ఎన్ని రోజులు నిర్వహించేది, విగ్రహం ఎత్తు ఎలక్ట్రిసిటీ అనుమతులు తదితర వివరాలు ఉంటాయన్నారు. శాంతిభద్ర తలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కురుపాం

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని కురుపాం ఎస్సై షణ్ముఖరావు తెలిపారు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఉత్సవాలకు ముందస్తుగా ఆన్లైన్లో అనుమతులు పొందాలని సూచించారు. డీజే సౌండ్ సిస్టంలు, మందుగుండు సామాగ్రి, తదితర వాటిపై అనుమతులు ఉండాలన్నారు. అలాగే నిమజ్జన సమయంలో కమిటీ బాధ్యతగా వ్యవహరించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.